ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
ఆదివారం 11 ఆగస్టు 2024





వానాకాలం పంటల సర్వే

- క్షేత్ర స్థాయిలో వ్యవసాయ అధికారుల క్రాప్ బుకింగ్
- ప్రత్యేక వెబ్‌సైట్‌లో ఫొటోలతో అప్‌లోడ్
- సర్వే నంబర్ల ప్రకారం జియో ట్యాగింగ్
- ఇప్పటి వరకు 86,607 ఎకరాల వివరాలు సేకరణ
- వానాకాలం సాగు లక్ష్యం 2.42 లక్షల ఎకరాలు
- ఇప్పటి వరకు సాగు 1.95 లక్షల ఎకరాలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

నైరుతి వర్షాలు ముఖం చాటేయడంతో వానాకాలం పంటల సాగు ఆలస్యంగా మొదలైంది. అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలతో పంటలపై రైతులకు ఆశలు చిగురించాయి. వానాకాలం సీజన్ లక్ష్యం నెరవేరుతుందని భావిస్తున్నారు. జూన్‌లో వరినాట్లు మొదలు కాలేదు. జూలైలో మొదలైన వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. మరో వారం రోజులపాటు జిల్లాలో వరినాట్లు కొనసాగుతాయని వ్యవసాయ అధికా రులు భావిస్తున్నారు. వానాకాలం సీజన్ పంటల సాగు చివరి దశకు వస్తున్న క్రమంలో వ్యవసాయ అధికారులు క్రాప్ బుకింగ్‌ను వేగవంతం చేశారు. వ్యవసాయ అధికారుల బృందం క్షేత్ర స్థాయిలో సర్వే చేస్తోంది. జిల్లాలో వానాకాలం సీజన్‌కు సంబంధించి వివిధ పంటల్లో 86,607 ఎకరాలకు సంబంధించి క్రాప్ బుకింగ్ చేశారు. క్రాప్ బుకింగ్‌కు సంబంధించి పంట విస్తీర్ణం, సర్వే నంబర్ల ప్రకారం రైతు వివరాలు, క్షేత్రస్థాం యిలో పరిశీలించి జియో ట్యాగింగ్ చేపడుతున్నారు. ఫొటోలతో యాప్ ద్వారా అప్‌లోడ్ చేస్తున్నారు. దీని ద్వారా వానాకాలం సీజన్‌కు సంబంధించి కచ్చితమైన పంటల సాగు వివరాలు ప్రభు త్వానికి అందుతాయి. ఈ విధానం వ్యవసాయానికి సంబంధించి సంక్షేమ పథకాలను అందించడంలో దోహదపడుతుందని భావిస్తు న్నారు.

● జిల్లాలో 1.95 లక్షల ఎకరాల్లో సాగు

వానాకాలం సీజన్‌కు సంబంధించి జిల్లాలో 2,42,766 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు అంచనాలు వేశారు. ఇప్పటి వరకు 1.95 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు వేశారు. వ్యవసాయ శాఖ వానాకాలం సీజన్‌కు సంబంధించి వరి 1.83 లక్షల ఎకరాలు, మొక్కజొన్న 1510, పత్తి 49,210, కందులు 1502, పెసర 348, ఇతర పంటలు 599, ఉద్యాన పంటలు 6900 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేశారు. ఇందులో ఇప్పటి వరకు వరి 1,47,428 ఎకరాలు, పత్తి 46,261, మొక్కజొన్న 992, కందులు 839, పెసర 50 ఎకరాల్లో విత్తనాలు వేసుకున్నారు. జిల్లాలో 2.42 లక్షల ఎకరాల్లో సాగుకు సంబంధించి మండలాల్లో ఇప్పటి వరకు గంభీరావుపేట మండలంలో 15058 ఎకరాల్లో సాగు కాగా ఇల్లంతకుంట 35,701, ముస్తాబాద్ 18,381, సిరిసిల్ల 3994, తంగళ్లపల్లి 17,791, వీర్నపల్లి 5065, ఎల్లారెడ్డిపేట 19,006, బోయినపల్లి 17,412, చందుర్తి 18,105, కోనరావుపేట 16,796, రుద్రంగి 9340, వేములవాడ 6801 ఎకరాలు, వేములవాడ రూరల్ 12,476 ఎకరాల్లో సాగు చేశారు.

● జిల్లాలో ప్రధానంగా వరి, పత్తి సాగు

జిల్లాలో వానాకాలం సీజన్‌లో ప్రధాన పంటలుగా వరి, పత్తి సాగు వైపే మొగ్గు చూపారు. జిల్లాలో వరి 1.83 లక్షల ఎకరాలకు 1.47 లక్షల ఎకరాల్లో నాట్లు వేసుకున్నారు. మరో వారం రోజులపాటు వరి నాట్లు కొనసాగుతాయని వ్యవసాయ అధికారులు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు గంభీరావుపేటలో 14,855 ఎకరాల్లో నాట్లు వేసుకోగా ఇల్లంతకుంటలో 22,846 ఎకరాలు, ముస్తాబాద్ 17,610, సిరిసిల్ల 3190, తంగళ్లపల్లి 16,880, వీర్నపల్లిలో 4715, ఎల్లారెడ్డిపేట 15,401, బోయినపల్లి 11,137, చందుర్తి 13,200, కోనరావుపేట 12,309, రుద్రంగి 5200, వేములవాడ 1700, వేములవాడ రూరల్‌లో 8385 ఎకరాల్లో వరినాట్లు పడ్డాయి. జిల్లాలో 49,215 ఎకరాల్లో పత్తి సాగు చేస్తారని అంచనాలు వేయగా ఇప్పటి వరకు 46,261 ఎకరాల్లో విత్తనాలు వేసుకున్నారు. ఇందులో గంభీరావుపేటలో 180 ఎకరాలు, ఇల్లంతకుంట 12,133, ముస్తాబాద్ 558, సిరిసిల్ల 783, తంగళ్లపల్లి 812, వీర్నపల్లి 350b, ఎల్లారెడ్డిపేట 3538, బోయినపల్లి 5970, చందుర్తి4370, కోనరావుపేట 4426, రుద్రంగి 3620, వేములవాడ 5004, వేములవాడ రూరల్‌లో 4017 ఎకరాల్లో విత్తనాలు వేసుకున్నారు. వీటికి సంబంధించిన క్రాప్ బుకింగ్ చేసున్నారు

క్రాప్ బుకింగ్ సర్వే కొనసాగుతుంది



- భాస్కర్, జిల్లా వ్యవసాయ అధికారి

జిల్లాలో వానాకాలం సాగుకు సంబంధించి క్రాప్ బుకింగ్ సర్వే కొనసాగుతుంది. జీపీఎస్ ద్వారా జియో ట్యాగింగ్, ఫొటోలతో సహా పంటల వివరాలు, వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నాం. క్రాప్ బుకింగ్ ద్వారా కచ్చితమైన వివరాలు వస్తాయి. దీంతో దిగుబడి అంచనా తెలుస్తుంది.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 10: వేములవాడ రాజ రాజేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శిం చుకొని తరించారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్నారు. భక్తులు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ తిరుపతిరావు, ఎడ్ల శివసాయి ఏర్పాట్లను పర్యవేక్షించారు.





బహ్రెయిన్ జైల్లో చీర్లవంచ వాసి

- పాస్‌పోర్టు, వీసా లేక జైలు పాలు

- ఆందోళనలో కుటుంబ సభ్యులు

తంగళ్లపల్లి, ఆగస్టు 10: ఉపాధి కోసం బహ్రెయిన్ వెళ్లిన తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన మానువాడ నర్సయ్య(62) పాస్ పోర్టు, వీసా గడువు ముగియడంతో ఈ ఏడాది జనవరి నుంచి జైలులో మగ్గుతున్నాడు. కుటుంబ సభ్యులు కథనం ప్రకారం.. మధ్య మానేరు ముంపు గ్రామానికి చెందిన మానువాడ నర్సయ్య ఉపాధి కోసం 1996 సెప్టెంబరు 23న బహ్రెయిన్ వెళ్లాడు. అక్కడ ది అరబ్ ఇంజనీరింగ్ అండ్ కాంట్రాక్టింగ్ కంపెనీలో మూడేళ్లపాటు తాపి మేస్త్రీగా పని చేశాడు. ఆగస్టు 1999లో వర్క్ పర్మిట్ ముగిసింది. అప్పటి నుంచి అనుమతి లేకుండానే బహ్రెయిన్‌లో పని చేస్తున్నాడు. ఏడాదికోసారి కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తన క్షేమ సమాచారం అందించేవాడు. ఈ ఏడాది జనవరిలో కుటుంబ సభ్యులకు తాను జైలులో ఉన్నట్లు సమాచారం అందించాడు. దీంతోవారు బహ్రెయిన్ జైలు నుంచి బయటకు తీసుకువచ్చే మార్గం కనబడక మదన పడుతున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి జైలులో మానువాడ నర్సయ్య ఎందుకు ఉన్నాడు? ఎలా తెలిసింది? విడుదల చేయించాడానికి తీసుకుంటున్న తదితర అంశాలను కుటుంబ సభ్యులకు వివరించాడు. బహ్రెయిన్ ప్రభుత్వ లేబర్ మార్కెట్ రెగ్యులేటరీ ఆథారిటీ 8వ తేదీ జనవరి 2024లో అక్కడి భారత రాయబారికి ఒక లేఖ రాయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చినట్లు భీంరెడ్డి తెలిపారు. నర్సయ్య పాస్‌పోర్టు పోయినట్లు, చట్ట విరుద్ధమైన స్థితిలో ఉన్నట్లు లేఖలో పేర్కొందని వివరించారు. నర్సయ్యను బహ్రె యిన్ నుంచి భారత్‌కు పంపించడం(డిపోర్టు) కోసం ఇండియా ఎంబసీ అవుట్ పాస్(తాత్కలిక పాస్‌పోర్టు) జారీ చేయాలని లేఖలో కోరినట్లు పేర్కొన్నారు. నాయకులు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలు త్వరతగతిన చర్యలు తీసుకోవాలని, నర్సయ్యను ఇండియాకు రప్పించాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ - మహిళా గురుకుల డిగ్రీ కళాశాల తనిఖీ



వంట సామగ్రిని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్, కలెక్టర్

వేములవాడ టౌన్, ఆగస్టు 10: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ సమీపంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలను జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూతో కలిసి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. విద్యాలయంలో వసతులు, పాఠ్యాంశాల బోధనపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం భోజనాలకు వినియోగించే కూరగాయాలు, వస్తువులను, సిద్ధం చేస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. బియ్యం నాణ్యతను తనిఖీ చేశారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, విద్యాల యంలో స్వచ్ఛత, పరిశుభ్రత పాటించాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు.

భవిష్యత్ నాశనం చేసుకోవద్దు



కర పత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్సై రమాకాంత్

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 10: యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎస్సై రమాకాంత్ అన్నారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య ఆధ్వర్యంలో 'మాదక దవ్యాల నివారణ చేపడతాం' కార్యక్రమానికి సంబంధించిన కర పత్రాలను ఎల్లారెడ్డి పేట పోలీస్ స్టేషన్‌లో ఆ సంఘం నాయకులతో కలిసి శనివారం ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ దేశ భవిష్యత్ యువతపై ఆధార పడి ఉందన్నారు. ఉన్నత లక్ష్యం వైపు పయనించాలన్నారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో గంజాయి, మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. డీవైఎఫ్ఐ సంఘం ముందుకు రావడం అభినందనీయమన్నారు. నాయకులు మహేశ్, ప్రవీణ్, అభిషేక్, సాయి, అనిల్, రాకేశ్, శివ, చందు, ప్రశాంత్, తరుణ్ పాల్గొన్నారు.

బహిరంగంగా పొగ తాగితే చర్యలు



స్మోక్ జోన్‌ను తొలగింపజేస్తున్న ఎస్సై

ముస్తాబాద్, ఆగస్టు 10:బహిరంగంగా పొగ తాగితే కఠిన చర్యలుం టాయని ముస్తాబాద్ ఎస్సై గణేశ్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పలు టీ పాయింట్‌లను, దుకాణాలను శనివారం తనిఖీ చేశారు. కొంత మంది చిన్న వయస్సులో సిగరెట్ తాగి చెడిపోతున్నారని, టీపాయింట్‌ల వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్మోక్ జోన్‌లను తీసివేయాలని కోరారు. టీపాయింట్‌ల ఆవరణలో బహిరంగంగా పొగతాగవద్దని, ఎవరైనా స్మోక్ చేస్తే కఠిన చర్యలుంటాయని అన్నారు. ప్రజల తిరిగే ప్రదేశాల్లో పొగతాగిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి చెరువులు నింపుతాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి, ఆగస్టు 10: వేములవాడ నియోజకవర్గంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి రూ.325 కోట్లతో పనులు చేపట్టి నియోజకవర్గంలోని చెరువుల నింపుతామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి వెళ్లేందుకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ. 25 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం కలెక్టర్ సందీప్ కుమార్‌ఝాతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి చెరువులు నింపి సాగు నీటి ఇబ్బందులు దూరం చేస్తామన్నారు. రుద్రవరంలో లోవోల్టేజ్ సమస్య పరిష్కారానికి 33/11 కేవీ సబ్ స్టేషన్ మంజూరైనట్లు తెలిపారు. రుద్రంగిలో రూ.కోటి నలభై లక్షల వ్యయంతో ఆసుపత్రి నిర్మాణానికి ఇటీవల భూమి పూజ చేశామన్నారు. చందుర్తిలో నిర్మిస్తున్న ఆసుపత్రిని త్వరలో సందర్శిస్తామన్నారు. లో లెవెల్ వంతెనలు ఉన్న చోట హై లెవెల్ వంతెనలు నిర్మిస్తామన్నారు. గ్రామాలకు అవసరమైన రోడ్లు వేయిస్తామన్నారు. వేములవాడ ఏరియా ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంకు సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయన్నారు. పోస్ట్ మార్టం సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నాగం కుమార్, పొద్దుపొడుపు లింగారెడ్డి పంచాయతీ రాజ్ ఈఈ భూమేశ్వర్, ఎంపీడీవో ప్రదీప్ నాయకులు చింతపంటి రామస్వామి, భీమారాజు కనకరాజు, బండారి శేఖర్, పులి సత్తయ్య, మ్యాకల గణేష్, బాణాల రవిందర్‌రెడ్డి, గొట్టె ప్రభాకర్, ముస్కు ముకుందరెడ్డి, దేవాస్వామి, మల్లేశం, ఎనగంటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కేజ్ వీల్స్‌తో రోడ్లు ధ్వంసం

- లక్షల రూపాయలు వెచ్చించి నిర్మాణం
- పట్టించుకోని అధికారులు
- వాహనదారులు, గ్రామీణుల ఆగ్రహం

చందుర్తి, ఆగస్టు 10: కేజ్‌వీల్స్‌తో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన రహదారులు ధ్వంసమవుతున్నాయి. ఇష్టారీతిన రోడ్లపై కేజ్ వీల్స్ ట్రాక్టర్లను పరుగుపెట్టిస్తుండడంతో రహదారులు అధ్వానంగా మారుతున్నాయి. వ్యవసాయ సీజన్‌లలో వరినాట్లకు ముందు దుక్కుల కోసం ట్రాక్టర్లకు ఈ చక్రాలను పొలాల్లోనే బిగించుకోవాలి. దున్నడం పూర్తయ్యాక అక్కడే తీసివేసి టైర్లు బిగించిన తర్వాతే రోడ్లపైకి ట్రాక్టర్లను తీసుకురావాలి. అయితే ట్రాక్టర్ల యజమానులు ఈ కాస్త శ్రమ పడలేక ఇంటి వద్దనే కేజ్ వీల్స్ బిగించుకొని రోడ్ల పైనుంచి పొలాలకు తీసుకెళ్తున్నారు. దీంతో ఇనుప చక్రాల దాటికి సీసీ రోడ్లతోపాటు తారురోడ్లపై గుంతలు ఏర్పడుతున్నాయి. చందుర్తి మండలంలో ఎనగల్, బండపల్లి, నర్సింగాపూర్, మూడపల్లి, తిమ్మాపూర్, సనుగుల, దేవునితండా రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎనగల్ గ్రామంలో బైపాస్ రోడ్డులో కేజ్ వీల్స్‌కు రోడ్డు దెబ్బతిని ప్రయాణికులకు నరకం చూపిస్తున్నాయి. ఈ కేజ్ వీల్స్ ట్రాక్టర్లు ఒక్కసారి ప్రయాణిస్తే పదేళ్లు ఉండాల్సిన రహదారి రెండేళ్లకే దెబ్బతింటుందని నిపుణులు పేర్కొంటున్నారు. వ్యవసాయ సీజన్‌లలో వందలాది ట్రాక్టర్లు దమ్ము చక్రాలతో ఈ రహదారుల్లో ప్రయాణిస్తున్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన రహదారులు దెబ్బతిని ప్రయాణానికి పనికి రాకుండా పోతున్నాయి. మరమ్మతు చేసినా మళ్లీ యథా పరిస్థితే. వాహన చట్టాల నియమాల మేరకు రహదారుల పైకి దమ్ము చక్రాలతో రావడానికి అవకాశమే లేదు. నియంత్రణ కరువవడంతో గ్రామీణ రహదారులతో పాటు ప్రధాన రహదారులను ఛిద్రం చేస్తున్నారు. రవాణా శాఖ అధికారులతో పాటు రోడ్డు భవనాల శాఖ, పోలీసులు సమన్వయంతో స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



సీసీ రోడ్డుపై కేజ్ వీల్స్‌తో వెళ్తున్న ట్రాక్టర్

రోడ్లపై కేజ్ వీల్స్ ట్రాక్టర్‌లు నడిపితే చర్యలు

- శ్రీకాంత్, ఎస్సై చందుర్తి



కేజీ వీల్స్‌తో ట్రాక్టర్లను నడుపడంతో రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన రహదారులు ధ్వంసం అవుతాయి. కేజ్ వీల్స్‌తో ట్రాక్టర్లను రోడ్డుపై నడిపితే సీజ్ చేస్తాం. బాధ్యులపై కేసులు నమోదు చేస్తాం. రోడ్లు ధ్వంసం కాకుండా ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు జాగ్రత్తగా నడపాలి.

అత్తింటి వారి దాష్టీకం

- భర్త సంవత్సరీకానికి ఇంటికి వచ్చిన మహిళ
- తాళం వేసుకొని వెళ్లిపోయిన అత్తామామలు


తాళం వేసి ఉన్న ఇంటి ఎదుట పిల్లలతో కలిసి కూర్చున్న రవళి

హుజూరాబాద్, ఆగస్టు 10: అనారోగ్యంతో భర్త చనిపోగా పిల్లలతో కాలం వెళ్లదీస్తున్న క్రమంలో అత్తింటి వారు వేధింపులకు గురి చేస్తున్నారు. శనివారం భర్త సంవత్సరీకం పెట్టేందుకు ఇంటికి రాగా అత్తామామలు తాళం వేసుకొని వెళ్లిపోయారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణానికి చెందిన శ్రావణ్‌కు ఎల్కతుర్తి మండలం జీల్గుల గ్రామానికి చెందిన రవళితో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలున్నారు. గత ఏడాది ఆగస్టు నెలలో శ్రావణ్ క్యాన్సర్‌తో మృతి చెందాడు. ఇల్లును ఖాళీ చేసి వేరే చోట ఉండాలని చెప్పడంతో రవళి వేరే చోట నివాసం ఉంటుంది. భర్త సంవత్సరీకం చెద్దామని శనివారం ఇంటికి రాగా అత్తామామలు ఇంటికి తాళం వేసుకొని వెళ్లిపోయారు. చేసేది ఏం లేక ఇంటి ఎదుట భర్త ఫొటో పెట్టుకుని రవళి తన పిల్లలతో కలిసి సంవత్సరీకం నిర్వహించింది. చుట్టు పక్కల వారు ఈ పరిస్థితిని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. తమ అత్తామామలు వేధింపులకు గురి చేస్తున్నారని, తనకు, తన బిడ్డలకు న్యాయం చేయాలని రవళి వేడుకుంది.

ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి పట్టాలివ్వాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు టి సాగర్


నినాదాలు చేస్తున్న నాయకులు

గోదావరిఖని, ఆగస్టు 10: రాష్ట్రంలో అనేక జిల్లాల్లో ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకొని నివాసముంటున్న నిరుపేదలకు పట్టాలిచ్చి సౌకర్యాలు కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు టి సాగర్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పవర్‌హౌస్ కాలనీలోని ప్రైవేట్ గార్డెన్స్‌లో సీపీఎం పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉత్తమ తెలంగాణ రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు మహేశ్వరి పార్టీ జెండా ఆవిష్కరించగా జిల్లా కార్యదర్శి యాకయ్య తరగతులను ప్రారంభించారు. అనంతరం సాగర్ మాట్లాడుతూ రెండు సంవత్సరాల నుంచి నిరుపేదలు ఇళ్లు నిర్మించుకొని నివాసముంటుంటే సరైన రోడ్లు, తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేదలకు ఇళ్ల కేటాయింపునకు బడ్జెట్‌లో నిధులేమి లేవన్నారు. నిరుపేదలకు కేంద్రప్రభుత్వం 10లక్షల రూపాయలు ఇంటి నిర్మాణానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పందించి 5 లక్షల రూపాయలు ఇవ్వడమేకాకుండా పట్టాలు ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తరగతులకు సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు లిల్లల బాలకృష్ణ ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో వేల్పుల కుమార స్వామి, ఎం రామాచారి, భాగ్య, అనూష, సృజన, భవాని, మహేశ్వరి, జమున, వాణి, శివ కుమార్, సతీష్, బాలకృష్ణ, క్రాంతి, పెద్దపల్లి, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల నుంచి గుడిసె వాసులు పాల్గొన్నారు.

ధర్మపురి క్షేత్రంలో శ్రావణ భక్తుల రద్దీ

ధర్మపురి, ఆగస్టు 10: శ్రావణ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో మొదటి శనివారం భక్తుల రద్దీ పెరిగింది. ఆలయాల్లో ఉదయం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. గోదావరిలో స్నానాలు ఆచరించిన భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పం డితులు ముత్యాలశర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్, ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

గురుకుల విద్యార్థి అనిరుధ్ అంత్యక్రియలు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 10: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకులం అస్వస్థతకు గురై మృతి చెందిన విద్యార్థి ఎడమల్ల అనిరుధ్ అంత్యక్రియలను బాలుడి అమ్మమ్మ ఊరు ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో శనివారం నిర్వహించారు. మృతుడి తండ్రి కృష్ణారెడ్డి గల్ఫ్ నుంచి చేరుకోవడంతో అంతిమ సంస్కారాలు జరిపించారు. కన్న కొడుకు చనిపోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

అనిరుధ్ కుటుంబాన్ని ఆదుకుంటాం

విద్యార్థి అనిరుధ్ కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో విద్యార్థి అనురుధ్ మృతదేహం వద్ద శనివారం నివాళులు అర్పించారు. అనంతరం ఇటీవల నారాయణపూర్‌లో గుండెపోటుతో మృతి చెందిన లింగాల సురేశ్ కుటుంబ సభ్యులతోపాటు మండల కేంద్రంలో కుక్కల దాడిలో గాయ పడిన చిన్నారులను కేకే మహేందర్‌రెడ్డి పరామర్శించారు. నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్, గిరిధర్‌రెడ్డి, లింగాగౌడ్, రాంరెడ్డి, బాబు, బుచ్చాగౌడ్, రాజు, శ్రీనివాస్, రాములు ఉన్నారు.

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య


రమేష్ మృతదేహం

సైదాపూర్, ఆగస్టు 10: మండలంలోని రాయికల్ గ్రామానికి చెందిన కొలకాని రాజు (32) అనారోగ్యంతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజు మద్యానికి బానిసయ్యాడు. దీంతో ఆరోగ్యం దెబ్బతిని కడుపునొప్పి వచ్చేది. శుక్రవారం కడుపునొప్పి భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో రేకుల షెడ్డు పైపునకు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. రాజు భార్య మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు.

ద్విచక్ర వాహనాల చోరీ ముఠా అరెస్ట్



నేరాలకు పాల్పడిన నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎస్పీ, చోరీకి గురైన ద్విచక్ర వాహనాలు

మెట్‌పల్లి , ఆగస్టు 10 (ఇబ్రహీంపట్నం): రద్దీగా ఉన్న ప్రాంతంలో బైకులు పార్క్ చేసి హ్యాండిల్ లాక్ వేయకుండా ఉన్న ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న దొంగల ముఠాను మెట్‌పల్లి పోలీసులు పట్టుకుని కటకటాలకు పంపారు. జగిత్యాల జిల్లా పరి ధిలోని మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల టౌన్, గొల్లపల్లితో పాటు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, కమ్మర్‌పల్లి, పోలీస్ స్టేషన్ పరిధిలో కొంత కాలంగా హ్యాండిల్ లాక్ వేయని ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఘరానా దొంగను, దొంగ సొత్తును కొన్న మరో ఇద్దరు నిందితులను శనివారం మెట్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టుకు సంబంధించిన వివరాలను ఎస్పీ పోలీస్ స్టేషన్‌లో వెల్లడించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా ఎర్గట్ల మండలం గుమ్మిర్యాల గ్రామానికి చెందిన మన్నే లక్ష్మణ్ గతంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేశాడు. ప్రమాదవశాత్తు కాలు విర గడంలో డ్రైవర్ వృత్తి మానేసి మద్యానికి బానిసై జల్సాలకు అలవాటు పడ్డాడు. సు లువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో దొంగతనాలు మొదలు పెట్టారు. ఈ క్రమంలో హ్యాండిల్ లాక్ వేయని బైక్‌లను లక్ష్యం చేసుకుని రద్దీగా ఉండే మార్కెట్ ఏరియా, ఆసుపత్రులు, వివిధ షాపుల ముందు నిలిపిన బైక్‌లను దొంగతనం చేయడం ప్రారంభించాడు. ఇందుకు ముందుగా వివిధ రకాల మోటార్ సైకిళ్ల తాళం చేవిలని సేకరించి వాటి సహాయంతో ద్విచక్ర వాహనాలను చోరీ చేసేవాడు. గత సంవత్సరం నుంచి జగిత్యాల, నిజామాబాద్ జిల్లాలో మొత్తం 6 లక్షల విలువ గల 20 ద్విచక్ర వాహనాలను దొంగిలించాడు. జగిత్యాల జిల్లాలో 13 బైక్‌లు, నిజామాబాద్ జిల్లాలో 7 బైక్‌లు అపహరించారు. చోరీ చేసిన బైక్‌లను నిర్మల్ జిల్లా మామడ మండలం పొం కల్ గ్రామానికి చెందిన మోహమ్మద్ మోసిన్ (ఏ2) చికెన్ షాపు నిర్వహకుడికి, అబ్దుల్ రషీద్‌కు(ఏ3) బైక్ మెకానిక్ షాపు నిర్వాహకుడు ఇద్దరికి చెరో 10 ద్విచక్ర వాహనాలను ఒక్కో బైక్‌ను 8 వేల నుంచి 10 వేల రూపాయల చొప్పున అమ్మి వచ్చిన డబ్బులని జ ల్సాలకు ఖర్చు చేసేవాడు. దొంగ సొత్తు అని తెలిసి కూడ మోహమ్మద్ మోసిన్ అబ్దుల్ రషీద్ లక్ష్మణ్ వద్ద తక్కువ ధరకు కొని ప్రజలకు ఎక్కువ ధరలకు అమ్మి సోమ్ము చేసుకునే వారు.

కొంత కాలంగా ద్విచక్ర వాహనాల చోరీలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఎస్పీ అశోక్ కుమార్ అదేశాల మేరకు పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు పర్యవేక్షణలో సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్ఐ చిరంజీవి, సిబ్బంది అందుబాటులో ఉన్న టెక్నాలజీని ఉపయోగిస్తూ బృందాలుగా ఏర్పడి పట్టణ శివారులోని వెంకట్రావ్‌పేట వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానస్పదంగా వస్తున్న లక్ష్మణ్‌ని పట్టుకుని విచారించగా ద్విచక్ర వాహనాలు దొంగతనం చేసినట్లు అంగీ కరించడంతో అతనితో పాటు మిగతా నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నింది తులను పట్టుకోవడంలో చకచాక్యంగా వ్యవహరించిన పోలీసులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు

రూ. 27000 నగదు ద్విచక్రవాహనం స్వాధీనం

కోరుట్ల: దొంగతనాలకు పాల్పడుతున్న ఒక మైనర్‌తో పాటు మరో వ్యక్తిని కోరుట్ల పోలీసులు అరెస్టు చేసినట్లు సీఐ సురేష్ బాబు తెలిపారు. శనివారం పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో ఎస్ఐ కిరణ్ కుమార్‌తో కలిసి సీఐ అరెస్టు వివ రాలను వెల్లడించారు. పట్టణంలోని కావేరి గార్డెన్ వద్ద ఎస్ఐ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఒక యువకుడు, మరో బాలుడు అనుమానాస్పదంగా కన్పించడంతో పోలీసు స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. జగిత్యాల మండలం పొలాస గ్రామానికి చెందిన హర్షద్ అతని అల్లుడిగా గుర్తించారు. హర్షద్ అతని అల్లుడితో కలిసి చోరీలకు అలవాటు పడ్డారు. ఈ నెల 5వ తేదీన కోరుట్ల పట్టణంలో ఇద్దరు కలిసి ఓ ద్విచక్ర వాహనం, 7వ తేదీన ఐబీ రోడ్డులోని ఓ కిరాణం దుకాణంలో షెటర్ తాళం పగులగొట్టి దుకాణంలోని రూ 27,000 ఎత్తుకెళ్లారు. కోరుట్ల పట్టణంతో పాటు జగిత్యాల జిల్లా పరిధిలోని వివిధ చోరి కేసుల్లో వీరు నిదితులుగా గుర్తించినట్టు సీఐ తెలిపారు. వారి వద్ద ఉన్న 27,000 నగదు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసులో చాక్యచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ, కానిస్టేబుల్స్ ఎల్లయ్య, సత్తయ్య, సాగర్, శ్రీనివాస్‌లను సీఐ అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సురేష్ బాబు

బాలుడిపై వీధి కుక్క దాడి

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 10 : మండలంలోని రామలచ్చక్కపేట గ్రామంలో బాలుడిపై వీధి కుక్క దాడి చేసిన ఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామంలోని ఇంటి ముందు ఆడుకుంటున్న మూడేళ్ల బాలుడు నిహాన్స్‌ను వీధి కుక్క అకస్మాత్తుగా దాడి చేసింది. దీంతో బాలుడు అరవడంతో ఇంట్లో కుటుంబ సభ్యులు గమనించి కుక్కను తరిమి గాయపడ్డ నిహాన్స్‌ను మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామాల్లో వీధి కుక్కలతో చిన్నపిల్లలకు రక్షణ లేకుండా పోయిందని ప్రజలు పేర్కొంటున్నారు. వీధి కుక్కల నుంచి రక్షణ కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరికి తీవ్ర గాయాలు

మానకొండూర్, ఆగస్టు 10: విద్యుదాఘాతంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మానకొండూర్ సబ్‌స్టేషన్‌లో జేఎల్ఎంగా కార్తీక్ విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన చేయాల్సిన పనులను మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన చొప్పరి బుచ్చయ్యతో చేయిస్తుంటాడు. మానకొండూర్ శివారు గ్రామమైన బంజేరుపల్లిలో రెండు రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు పనులు చేస్తుండగా బుచ్చయ్య విద్యుదాఘాతానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడ్డ బుచ్చయ్యను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు.

ఆపదలో ఉన్న వృద్ధుడికి అండ

అనాథాశ్రమంలో చేర్పించిన సీఐ సరిలాల్


లింగయ్యను ఆశ్రమానికి అప్పగిస్తున్న సీఐ సరిలాల్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 10: ఇద్దరు కూతుర్లు ఉన్నా ఎవరూ అతని పోషణ పట్టించుకోకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో ఎక్కడికి వెళ్లాలో తెలియక ఓ వృద్ధుడు కరీంనగర్ బస్టాండ్‌కు చేరుకుని అక్కడే గడుపుతుండగా శనివారం కరీంనగర్ ఒకటో ఠాణా సీఐ సరిలాల్ చేరదీసి కరీంనగర్‌లోని వీరబ్రహ్మేంద్ర అనాథ వృద్ధుల ఆశ్రమంలో చేర్పించారు. సీఐ సరిలాల్ తెలిపిన వివరాల ప్రకారం... పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం పెద్దంపేటకు చెందిన ఇల్లందుల లింగయ్య దిక్కుతోచని స్థితిలో కరీంనగర్ బస్టాండ్‌లో తిరుగుతూ సీఐ సరిలాల్‌కు కనిపించాడు. లింగయ్య వివరాలు సేకరించగా తనకు ఇద్దరు కూతుర్లు ఉన్నారని, ఎవరూ తన ఆలనాపాలనా చూడకపోవడంతో మనస్థాపంతోనే బస్టాండ్‌కు చేరుకున్నానని వృద్ధుడు లింగయ్య తన బాధను సీఐతో వెల్లగక్కాడు. వెంటనే సీఐ సరిలాల్ కరీంనగర్ హౌసింగ్‌బోర్డు కాలనీలోని వీడీ ఫౌండేషన్ వీరబ్రహ్మేంద్ర అనాథవృద్ధుల ఆశ్రమం నిర్వాహకుడు వీరమాధవ్‌కు సమాచారం అందించాడు. వీరమాధవ్‌ను ఠాణాకు పిలిపించుకుని వృద్ధుడు లింగయ్య బాగోగులు చూసుకోవాలని అతన్ని అప్పగించారు. వీరమాధవ్‌ను సీఐతో పాటు స్థానికులు అభినందించారు.

ఆర్థిక ఇబ్బందులతో లారీ డ్రైవర్ ఆత్మహత్య


రమేష్ మృతదేహం

చొప్పదండి, ఆగస్టు 10: పట్టణానికి చెందిన మురుకుట్ల రమేష్ (49) అనే లారీ డ్రైవర్ ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. రమేష్ ఫైనాన్స్‌లో 5 లక్షల లోన్ తీసుకొని లారీని కొన్నాడు. ఆ తరువాత 12 లక్షల లోన్ తీసుకుని మరో లారీ కొన్నాడు. వర్షాల కారణంగా రెండు నెలలపాటు లారీ నడవకపోవడంతో ఇన్‌స్టాల్‌మెంట్లు చెల్లించలేదు. ఫైనాన్స్ కంపెనీకి చెందిన వ్యక్తులు ఇటీవల రమేశ్ ఇంటికి వచ్చి గొడవ చేశారు. మనస్తాపం చెందిన రమేష్ ఈ నెల 8న పురుగుల మందు తాగగా కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. రమేష్ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. రమేష్ భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనూష తెలిపారు. రమేష్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ చైర్మెన్ కొత్తూరి మహేశ్, పట్టణ అధ్యక్షుడు ముద్దం తిరుపతి ఐదు వేల నగదును రమేష్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

శ్రీపాద నుంచి తగ్గిన ఎత్తిపోతలు

పెద్దపల్లి/రామడుగు/బోయినపల్లి/ఇల్లంతకుంట ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. శనివారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 3,602 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా నంది, గాయత్రి పంప్ హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి ఒక మోటార్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, హైదరాబాద్, ఆయా నియోజకవర్గాల ప్రజల తాగునీటి అవసరాల కోసం 452 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 13.846 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో వర్షాలు లేక వరద తగ్గుముఖం పట్టడంతో ఒక మోటార్ నుంచే నీటిని ఎత్తిపోస్తున్నారు. ఇల్లంతకుంట మండలంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.18 టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు నుంచి సర్జిపూల్‌కు వచ్చిన నీటిని రెండు పంపుల ద్వారా ప్రతిరోజు 6,400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి రంగనాయకసాగర్‌కు ప్రతిరోజు 6,600 టీఎంసీల నీటిని విడుదల చేస్తున్నారు. మిడ్ మానేరు ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 3,700 క్యూసెక్కులు ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 27.50 టీఎంసీలకు ప్రస్తుతం 17.06 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది. అన్నపూర్ణ ప్రాజెక్టుకు 6,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కాలువకు తగ్గిన నీటి విడుదల

జగిత్యాల: వానాకాలం పంటల సాగుకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదలను శనివారం అధికారులు కొనసాగించారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 500 క్యూసెక్కులు తగ్గింపుతో 2,500 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఎస్సారెస్పీలోకి 3,333 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 47.25 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 3,333 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

కొండగట్టుకు శ్రావణ శోభ

● అంజన్నను దర్శించుకున్న వేలాది భక్తులు


శేషవాహనంపై స్వామివారు

మల్యాల, ఆగస్టు 6: కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధానం శ్రావణ శోభను సంతరించుకుంది. శనివారం వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం భేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు చేశారు. శ్రావణ సప్తాహ ఉత్సవాలు శనివారం కూడా కొనసాగాయి. అంజనేయస్వామి, వెంకటేశ్వర స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. ఇబ్రహీంపట్నం మండలానికి చెందిన రత్నమాల అనే భక్తురాలు దైవదర్శనానికి వచ్చి చేతిబ్యాగ్ పోగొట్టుకోగా ఏఎస్సై చిలుక శ్రీనివాస్, హోంగార్డు రమేష్‌లు బ్యాగు వెతికి భక్తురాలికి అప్పగించారు.

బీసీ కమిషన్ సభ్యుడి పూజలు

బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రత్ పటేల్ శనివారం ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కటుంబ సమేతంగా వచ్చిన వారికి దర్శనం అనంతరం ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అధికారులు శాలువాలతో సత్కరించారు.

పీవోడబ్ల్యూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 10: ఈనెల 31, సెప్టెంబరు 1, 2తేదీలలో హైదరాబాద్‌లో జరుగనున్న పీవోడబ్ల్యూ 7వ రాష్ట్ర మహాసభలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు కె జ్యోతి పిలుపునిచ్చారు. శనివారం గోదావరిఖనిలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో పీవోడబ్ల్యూ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ మహాసభల్లో మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, అత్యాచారాలపై ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై ఇతర సమస్యలపై చర్చించి భవిష్యత్‌లో కార్యచరణను రూపొందించుకోవడం జరుగుతుందని తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల నిందితులపై కఠినచట్టాలు అమలు చేయలేకపోయారన్నారు. ఈ ప్రభుత్వంలోనైనా కఠినంగా వ్యవహరించి ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా బాధ్యులను శిక్షించి మహిళలను రక్షించాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి రజిత, బుచ్చమ్మ, మంగ, అమృత, స్వప్న, సరోజన, కవిత, పద్మ, శారదా, సత్యమ్మ, పద్మ, స్వర్ణలత పాల్గొన్నారు.

పల్లె నుంచి ఢిల్లీకి..

స్వాతంత్ర్య వేడుకలకు విద్యార్థినికి ఆహ్వానం


శ్రీచందన

రాయికల్, ఆగస్టు 10: రాయికల్ మండలంలోని రామారావుపల్లె గ్రామానికి చెందిన విద్యార్థిని పంబాల శ్రీచందను ఈ నెల 15వ తేదీన ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగే స్వాతంత్ర్య వేడుకలకు హాజరు కావాలని భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి ఆహ్వానం అందింది. భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖ నిర్వహించిన దేశ భక్తుల వేషధారణ పోటీలో శ్రీచందన సుభాష్ చంద్రబోస్ వేషం ధరించి పోటీలో పాల్గొనగా దేశవ్యాప్తంగా 250 మందిని ఎంపిక చేశారు. ఎంపికైనవారితో పాటు వారి సహాయకులకు స్వాతంత్ర్య వేడుకలు వీక్షించేందుకు ఆహ్వానం అందిందని గైడ్ టీచర్ కడకుంట్ల అభయ్‌రాజ్ తెలిపారు.

ఆగిఉన్న గూడ్స్‌రైలులో అగ్నిప్రమాదం

జగిత్యాలరూరల్, ఆగస్టు 10 : జగిత్యాల పట్టణంలోని లింగంపేట రైల్వేస్టేషన్‌లో ఆగిఉన్న గూడ్స్ రైలులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. రైల్వే అధికారులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం లింగంపేట రైల్వేస్టేషన్‌లో ఆగి ఉన్న గూడ్స్ రైలులో బొగ్గువ్యాగన్‌లో మంటలు చూసి స్టేషన్‌మాస్టర్ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన జగిత్యాల అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకొని వెంటనే మంటలను ఆర్పివేశారు. ఈసంఘటనలో సుమారు రూ. 5 లక్షల వరకు నష్టం జరిగిందని అగ్నిమాపక అధికారి ఎ. కృష్ణకాంత్ తెలిపారు. మంటలు ఎలా వ్యాపించాయి అనేది అధికారులు విచారణ చేస్తున్నారు. ఎల్ఎఫ్ రవీందర్, ఆపరేటర్ మల్లేశం, ఫైర్ మన్‌లు నరేష్, కార్తీక్, అరుణ్, శ్రీనివాస్ ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలన


పనుల వివరాలు తెలుసుకుంటున్న ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, ఆగస్టు 10: వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజీపేట గ్రామంలోని నక్కవాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శనివారం పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతుండడంతో వాహనదారులు, ప్రజల సౌకర్యార్థం తాత్కాలికంగా మట్టి రోడ్డు వేశారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా తాత్కాలిక మట్టి రోడ్డు కొట్టుకుపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న వెంటనే తాత్కాలిక మట్టి రోడ్డు వేయాలని కాంట్రాక్టర్‌ను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం, నాయకులు రాజు, గోవర్ధన్ రెడ్డి, ఎల్లా గౌడ్, ప్రభాకర్, జగన్‌రెడ్డి, హరినందన్, మల్లేశం, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రాణం పోతున్నా పట్టించుకోని ప్రభుత్వం

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 10 : రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు అనుమానాస్పద స్థితిలో మరణిస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సిరిసిల్ల పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 15 రోజుల వ్యవధిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇద్దరు విద్యార్థులు గురుకుల పాఠశాలలో మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించి విద్యార్థుల మరణానికి కారణమైన అధికారులను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. వసతి గృహాల్లో విద్యార్థులకు వసతులు కల్పించక పోవడం, పాలకులు, సంబంధిత అధికారుల అలసత్వం వంటివి విద్యార్థుల మరణాలకు దారితీస్తున్నాయన్నారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మరణించిన విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. వసతి గృహాల్లో కమిటీలు వేసి విద్యార్థుల మరణాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు మట్టే శ్రీనివాస్, కోడం వెంకటేష్, వాలిలాల సాయి, కోడి రోహిత్, మూడం సాయి, అరవింద్, సాయి పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

వీర్నపల్లి, ఆగస్టు 10 : మారుమూల అటవీ పల్లె ప్రజలు, గిరిజనులు కార్పొరేట్ ఆస్పత్రుల వైద్య శిబిరాలను సేవలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో కరీంనగర్ రెనీ ఆసుపత్రి, ఎల్లారెడ్డిపేట అశ్విని ఆసుపత్రి, ప్రభుత్వ వైద్యం సహకారంతో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన సేవలను అందిస్తామన్నారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. వైద్య శిబిరంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ వసంతరావు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ పెంచలయ్య, పిల్లల వైద్య నిపుణుడు అమరేందర్‌రెడ్డి, పీహెచ్‌సీ సూపరింటెండెంట్ బాబు, మండల వైద్యాధికారి ప్రమోద్, చిరంజీవి, అశ్విని ఆసుపత్రి వైద్యుడు అశోక్‌రావు, రెనీ ఆసుపత్రి వైద్యులు రవీందర్, అజయ్ కృష్ణ, అడ్మినిస్ట్రేషన్ ఇన్‌చార్జి అరవింద్, ప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, ఎస్‌కే గౌస్, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల అధ్యక్షులు భూత శ్రీనివాస్, సద్ది లక్ష్మారెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొంగు తిరుపతి, సీనియర్ నాయకులు లక్ష్మణ్, కాంతయ్య, రహీమ్, గౌస్, నాయకులు పాల్గొన్నారు.

●మెగా వైద్య శిబిరానికి లయన్స్ క్లబ్ ఎల్లారెడ్డిపేట చేయూతను అందించినట్లు ప్రెసిడెంట్ కోట సతీష్ కుమార్ తెలిపారు. శిబిరానికి వచ్చిన ప్రజలకు భోజన వసతి కల్పించినట్లు చెప్పారు. లయన్స్ క్లబ్ సెక్రెటరీ బాస్కర్ రెడ్డి, ట్రెజరర్ లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాల శుద్ధి

చందుర్తి, ఆగస్టు 10: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుతో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా చందుర్తి మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాల శుద్ధి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్, హర్‌ఘర్ తిరంగా కార్యక్రమ మండల కన్వీనర్ పెరుక గంగరాజు, అంబాల శ్రీకాంత్, మండల బీజేపీ అధ్యక్షుడు పొంచెటి రమేష్, ప్రధాన కార్యదర్శి చిర్రం తిరుపతి, నాయకులు చింతకుంట గంగాధర్, ఎతం వంశీ, సిరికొండ తిరుపతి, మేకొల్లి శ్రీహరి, చింతకుంట సాగర్, లింగంపల్లి జలందర్, పేరుక రంజిత్, మర్రి తిరుమల్ పాల్గొన్నారు.


విగ్రహానికి పూల మాల వేస్తున్న నాయకులు

గోశాలల్లో వసతుల కల్పనకు చర్యలు

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్


గోశాల పెడ్డను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, ఆగస్టు 10: వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవాలయం గోశాలల్లో కోడెలకు అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. తిప్పాపూర్ గోశాలలో రూ. 61 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి, రూ. 66 లక్షలతో మూడు షెడ్లను ప్రారంభించారు. జాతర గ్రౌండ్‌లోని గోశాలలో రూ.50 లక్షలతో రెండు షెడ్ల నిర్మాణానికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ రాజన్న ఆలయంలో రాజన్నకు కోడెమొక్కు చెల్లించడం అత్యంత ప్రీతి పాత్రమైనదన్నారు. చాలా మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని కోరిన కోరికలను తీర్చుమని వేడుకుంటారన్నారు. గోవుల కోసం ఆధునాతన పద్ధతులతో మరిన్ని నూతన షెడ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. సీఎం, దేవాదాయ శాఖ మంత్రి సూచనలతో కలెక్టర్‌తో కమిటీ వేసి భక్తులు చెల్లించిన కోడెలను పేద రైతులకు అందించాలని గుర్తు చేశారు. కోడెలకు ఆధునాతన వైద్యం అందిస్తూ, నాణ్యమైన దాణా, పచ్చి గడ్డి అందించేలా చర్యలు చేపడతామన్నారు. వన మహోత్సవంలో భాగంగా ఆలయ సువిశాల ప్రాంగణంలో మొక్కలను నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. రాజన్న ఆలయాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, ఈఈ రాజేష్, డీఈ రఘునందర్, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, తహసీల్దార్ మహేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఒగ్గు కథలకు వన్నె తెచ్చిన మహనీయుడు మిద్దె రాములు

ఒగ్గు కథలను ప్రపంచానికి పరిచయం చేసి వన్నె తెచ్చిన మహనీయుడు మిద్దె రాములు అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మిద్దె రాములు జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంతో ఓపికతో అనేక కథలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న గొప్పవ్యక్తి అన్నారు. గతంలో ఇందిరా గాంధీ సభ నిర్వహించిన సమయంలో ఆలస్యమైనప్పటికీ తన కథ గానంతో ఇందిరా గాంధీ వచ్చే వరకు ప్రజలను మైమరిపించారని గుర్తు చేశారు.

రుద్రవరం గ్రామానికి సబ్‌స్టేషన్

వేములవాడ మండలంలోని రుద్రవరం గ్రామానికి రూ. ఒక కోటి 97 లక్షల 46 వేలతో 33 కేవీ సబ్‌స్టేషన్ మంజూరైనట్లు ఆది శ్రీనివాస్ తెలిపారు. సబ్ స్టేషన్ మంజూరుకు కృషి చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్యతోపాటు రుద్రవరం గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.


మిద్దె రాములు జయంతికి హాజరైన ఆది శ్రీనివాస్

దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి

సిరిసిల్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలు, సహాయ పరికరాలు అందించడం సంతోషించదగ్గ విషయమని, దివ్యాంగుల సంక్షేమం కోసం కృషి చేయాలని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. శనివారం సిరిసిల్లలోని సినారె కళామందిరంలో మహిళా శిశు, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగుల ఉపకరణాలు, సహాయ పరికరాలకోసం ఏర్పాటు చేసిన ఎంపిక శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ గత ప్రభుత్వం దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు, సహాయ పరికరాలను అందించడంతోపాటు దివ్యాంగుల కోసం పింఛన్ రూ. 3016 అందించి అండగా నిలిచినట్లు, విద్య, ఉద్యోగ అవకాశాల్లోనూ రిజర్వేషన్లు కల్పించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా దివ్యాంగుల కోసం ఉపకరణాల పరికరాలు అందించడం కోసం ఎంపిక శిబిరాలు ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ పెంచి అర్హులైన వారందరికీ ఇవ్వాలని, దివ్యాంగుల సంక్షేమం కోసం కృషి చేయాలని కోరారు. దివ్యాంగులు తమ అంగవైకల్యాన్ని జయించి సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు. దివ్యాంగులపై గౌరవంగా ఉండాలన్నారు. ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలన్నారు. శిబిరంలో సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ప్రతినిధులు, దివ్యాంగులకు సేవలు అందించారు. జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, మున్సిపల్ కమిషనర్ లావణ్య, ఇన్‌చార్జి సీడీపీవో సుచరిత తదితరులు పాల్గొన్నారు.

ధర్మారాన్ని మండలంగా ప్రకటించాలి

కోనరావుపేట, ఆగస్టు 10 : కోనరావుపేట మండలంలోని ధర్మారం గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని ధర్మారం మాజీ సర్పంచ్ గున్నాల అరుణ లక్ష్మణ్ కోరారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ ధర్మారం మండలం కావడానికి అన్ని అనుకూలంగా ఉన్నాయన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం ధర్మారం గ్రామాన్ని మండలంగా ప్రకటించాలన్నారు. గత ప్రభుత్వానికి ధర్మారం గ్రామాన్ని మండలంగా ప్రకటించాలని వినతిపత్రం అందజేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి ధర్మారం గ్రామాన్ని మండలంగా ప్రకటించాలని కోరారు.

అనారోగ్యంతో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మృతి

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 10 : బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి సేవలందించిన సీనియర్ నాయకుడు ఈదులకంటి రత్నయ్య శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి నాయకులు స్థానిక సంజీవయ్యనగర్‌లోని రత్నయ్య నివాసంలో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. రత్నయ్య పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రత్నయ్య సేవలను గుర్తు చేసుకున్నారు. బీఆర్ఎస్ నాయకులు మామిడాల రమణ, కొండ శంకర్, అన్నారం రవి, పెరుమాండ్ల ప్రవీణ్, అనిల్, శ్రీనివాస్‌రావు, వంగూరి రవి ఉన్నారు.

బుర్ర రాములు మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు

ముస్తాబాద్, ఆగస్టు 10: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మండల అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్ మృతి పార్టీకి తీరని లోటని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి అన్నారు. కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ పరిస్థితి విషమించడంతో శనివారం రాములు గౌడ్ మృతి చెందారు. కేకే మహేందర్‌రెడ్డి బాధితులను పరామర్శించారు. రాములు గౌడ్ మృత దేహంపై కాంగ్రెస్ కండువా కప్పి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీకి రాములు ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. అంత్యక్రియల్లో మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, సామాజికవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

కోనరావుపేట, ఆగస్టు 10: అనుమతులు లేకుండా మూల వాగు నుంచి ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కోనరావుపేట ఎస్సై రాజశేఖర్ రెడ్డి అన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇద్దరిపై శనివారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కనగర్తి గ్రామానికి చెందిన పుట్ట చంద్రశేఖర్ అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా రిమాండ్ తరలించినట్లు తెలిపారు. వట్టిమల్ల గ్రామానికి చెందిన బాణాల రమేష్ అక్రమంగా ఇసుక తరలిస్తుండగా కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అనుమతులు ఉంటేనే ఇసుకను తరలించాలని, లేని పక్షంలో చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

భారతీయ పురాతన వస్తు ప్రదర్శన

వేములవాడ కల్చరల్, ఆగస్టు 10 : వేములవాడ పట్టణంలోని వివేకానంద ప్రైవేట్ స్కూల్‌లో శనివారం భారతీయ పురాతన వస్తుప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. భారతీయ సంస్కృతీసంప్రదాయాలను నేటి తరానికి తెలిపేందుకు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు పురాతన వస్తువులను సేకరించి ప్రదర్శించారు. కరస్పాండెంట్ గడీల ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు అండ

కోనరావుపేట, ఆగస్టు 10: సీఎం సహాయ నిధి పేదలకు ఆసరా అవుతోందని కాంగ్రెస్ కోనరావుపేట మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా అన్నారు. శనివారం కోనరావుపేట మండలం బావుసాయిపేటలో గ్రామానికి చెందిన షేక్ పాషాలకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.14 వేల విలువ చేసే చెక్కును అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో లబ్ధిదారులకు అందజేసినట్లు చెప్పారు. కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి నందు గౌడ్, నేరెళ్ల దేవయ్య, ముత్యం, చంద్రశేఖర్, ప్రదీప్, తిక్కల పోశయ్య, చొక్కాల దేవయ్య, జంగం దివాకర్, షేక్ కరీం, షేక్ హైదర్, సంజీవ్, ఉమయ్య, రమేష్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట:ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని 11 మంది లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక బీఆర్ఎస్ నాయకులు శనివారం అందజేశారు. ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

న్యాయ విచారణ చేపట్టాలి

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 9: మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలోని విద్యార్థుల మరణాలపై న్యాయ విచారణ చేపట్టాలని టీజేఎస్ నాయకుడు కంతి మోహన్‌రెడ్డి, నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు వలేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం గురుకుల పాఠశాలను పరిశీలించారు. విద్యార్థుల మరణాలు, అస్వస్థతకు గురైన సంఘటనపై ఉన్నత అధికారులతో న్యాయ విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలలో కనీస వసతులు కల్పించడంలో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోందని మండిపడ్డారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

వీర్నపల్లి, ఆగస్టు 10 : వీర్నపల్లి మండలం వన్‌పల్లి చెందిన భూపతిరెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతిచెందిన విషయం తెలుసుకుని ఆయన కుటుంబాన్ని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి శనివారం పరామర్శించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన కార్యకర్త మల్లారెడ్డి ఇటీవల మరణించగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొంగు తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, గౌస్ నాయకులు ఉన్నారు.

పవర్‌లూం కార్మికులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న టీఆర్‌పీఎస్‌ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ ప్రభ

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 10 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిరిసిల్ల పవర్‌లూం కార్మికులను ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రజా సంకల్ప ఐక్య వేదిక (టీఆర్‌పీఎస్‌ఐ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరాం రామకృష్ణ ప్రభ అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణంలోని మరమగ్గాల పరిశ్రమలను రాష్ట్ర నాయకులు సందర్శించారు. అనంతరం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. వారి రాజకీయ లబ్ధికోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించడాన్ని ఆక్షేపించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుఅనంతరం సిరిసిల్ల మరమగ్గాల కార్మికుల బతుకు దెరువు కోసం నాటి ప్రభుత్వం బతుకమ్మ చీరలను తీసుకొచ్చి కార్మికులకు ఉపాధి కల్పిస్తే నేటి ప్రభుత్వం బతుకమ్మ చీరల ఉత్పత్తిని, విద్యుత్ సబ్సిడీని నిలిపివేయడాని కుట్రలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్లలో 160 మంది నేత కార్మికులు ఇప్పుడున్న ప్రభుత్వాల వైఫల్యాల కారణంగా ఆత్మహత్య చేసుకున్నారన్నారు. ఆత్మహత్య చేసుకున్న నేత కార్మికుల కుటుంబాలకు రూ.5లక్షల ప్రమాద బీమాతో పాటు ప్రభుత్వం అదనంగా రూ.10లక్షలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో నేత కార్మికుల ఆత్మహత్యలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల ప్రాంతంలోని మరమగ్గాల పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలన్నారు. ప్రభుత్వం వస్త్ర పరిశ్రమ ఉత్పత్తిని పెంచే విధానాలకు రూపకల్పన చేయాలన్నారు. సిరిసిల్ల ప్రాంతంలో మరోసారి కార్మికులు ఆత్మహత్య చేసుకోకుండా ఉండేలా చేసి కార్మిక కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రజా సంకల్ప ఐక్య వేదిక వ్యవస్థాపకుడు కస్తూరి శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు గువ్వ తిరుపతి, అజయ్‌కుమార్, తంగళ్లపల్లి వేణుకుమార్, అనిల్‌కుమార్‌యాదవ్, రమేష్ పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులను నియమించాలి



డీటీఎఫ్ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 10 : ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులను నియమించాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైద్యుల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం డీటీఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యవర్గ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు దొంతుల శ్రీహరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజిరెడ్డి మాట్లాడుతూ ఇటీవల జరిగిన పదోన్నతుల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఇప్పటికైనా ప్రతీ ప్రాథమిక పాఠశాలలో డీఎడ్, బీఎడ్ సమస్యలను పరిష్కరించి, కామన్ సీనియారిటీ ద్వారా ప్రాథమిక ప్రధానోపాధ్యాయులను నియమించాలని కోరారు. ఐదువేల అదనపు ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలన్నారు. మోడల్ స్కూల్, కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఎంరఘుశంకర్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వంకూడా విద్యారంగానికి బడ్జెట్‌లో తక్కువ నిధులను కేటాయించడం బాధాకరమన్నారు. రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు బూర సదానందం మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు దొంతుల శ్రీహరి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పరం సుదర్శన్‌రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు సూజాత, వెంకటరమణారెడ్డి, వంగ తిరుపతి, రాష్ట్ర కౌన్సిలర్లు చక్రపాణి, కృష్ణారెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వారసంత.. సమస్యల చింత

● కనీస సౌకర్యాలు కరువు ● గ్రామీణుల ఇబ్బందులు


కోనరావుపేటలో రోడ్డుపై నిర్వహిస్తున్న సంత

కోనరావుపేట, ఆగస్టు 10: వారసంతల్లో సమస్యలతో జనం ఇబ్బందులు పడుతున్నారు. కోనరావుపేట మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ఇళ్లలోకి అవసరమైన కూరగాయలు, ఇతర సామగ్రి కొనాలంటే సమీప పట్టణాలైన సిరిసిల్ల, వేములవాడకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం గ్రామాల్లోనే వారసంతలు నిర్వహిస్తున్నారు. అయితే వారసంతల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో జనం అవస్థలు పడుతున్నారు. మండలంలో ఆదివారం నిజామాబాద్, సోమవారం మామిడిపల్లి, మల్కపేట, మంగళవారం వట్టిమల్ల, కొలనూర్, బావుసాయిపేట, మర్తనపేట, కనగర్తి, గురువారం కోనరావుపేట, శుక్రవారం ధర్మారం, నిమ్మపల్లి, శనివారం కనగర్తి, మరిమడ్ల గ్రామాల్లో వారసంతలు కొనసాగుతాయి. ప్రధానంగా గ్రామాల్లోని రహదారులపైనే సంతలు నిర్వహిస్తుండడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. సంతల్లో మరుగుదొడ్లు, టాయిలెట్లు, నీటి వసతి తదితర సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సంతకు వచ్చే మహిళలు, విక్రయదారులు, ఇతరులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని, ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న సంతల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

ప్రత్యేక స్థలం కేటాయించాలి

- గోపు లక్ష్మి

గ్రామాల్లో నిర్వహిస్తున్న వారసంతల్లో మార్కెట్ కోసం ప్రత్యేక స్థలం కేటాయించాలి. వారసంతలో సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించాలి. ఆయా గ్రామాల్లో సౌకర్యాలు కల్పించాలి.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే విద్యార్థుల మరణాలు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 10: రాష్ట్రంలో జరుగుతున్న విద్యార్థుల మరణాలకు రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని, ఈ మరణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని ఏబీవీపీ నాయకులు రంజిత్‌కుమార్, రాకేష్‌లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని స్థానిక కొత్తబస్టాండ్ వద్ద రహదారిపై పెద్దాపూర్ హాస్టల్‌లో విద్యార్థి మృతి ఘటనను నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. పెద్దాపూర్ గురుకుల హాస్టల్ ఘటనపై ఇప్పటివరకు రాష్ట్రప్రభుత్వం నుంచి ఒక్కరూ పరామర్శించలేదని, నెపంతో కప్పిపుచ్చే ప్రయత్నం చేయడం దురదృష్టకరం అన్నారు. 15రోజుల్లో హాస్టల్లో ఇద్దరు విద్యార్థులు మృతి చెందడం ప్రభుత్వం, అధికారుల పనితీరుకు నిదర్శనం అన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తొమ్మిది నెలల్లో రాష్ట్రంలో సుమారు 30మంది విద్యార్థులు మరణించారని, ఈ మరణాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు అజయ్, శ్రీనివాస్, సునీల్, హరీష్, నిఖిల్, అభిషేక్, విఘ్నేష్, ప్రమోద్, శివ, హర్షవర్ధన్, విష్ణు, మనోజ్ పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు మూసివేయాలి


ఆందోళన చేస్తున్న కాలనీ వాసులు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 10 : ఇళ్ల మధ్యలో ఏర్పాటు చేసిన బెల్ట్‌షాపులతో ఇబ్బందులు పడుతున్నామని, వాటిని మూసివేయాలని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేట వడ్డెర కాలనీలో అనుమతులు లేకుండా మూడు బెల్ట్ షాపులను ఏర్పాటు చేశారని, బెల్ట్ షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని శనివారం కాలనీవాసులు ఆందోళనకు దిగారు. కాలనీలో బెల్ట్‌షాపులను నిర్వహిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తమ్మిశెట్టి వెంకటి, శివరాత్రి పెద్దమల్లయ్య, వేముల రాములు, తమ్మిశెట్టి రాజు, తమ్మిశెట్టి ప్రశాంత్, తమ్మిశెట్టి చందు, వేముల శేఖర్, తమ్మిశెట్టి శేఖర్, వల్లెపు మల్లేశం, సూర కనుకయ్య, సూర రాజు, గొల్లెం రాములు, తిరుపతి, గండి కోట నవీన్, గొల్లెం కనుకయ్య, తమ్మిశెట్టి పెద్దవెంకటి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

గంభీరావుపేట, ఆగస్టు 10: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుమేరకు ప్రతీ ఇంటిపై జెండా ఎగురవేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్ అన్నారు. భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. తెలియజేయడం జరిగినది గంభీరావుపేట మండల కేంద్రంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతీయులందరికీ దేశంపై గౌరవం పెరగాలని నరేంద్రమోదీ ప్రతి ఇంటి పైన జాతీయ జెండా ఎగరవేసి దేశభక్తి చాటాలను ఉద్దేశంతోనే పార్టీలకతీతంగా కుల మతాల కతీతంగా ప్రతి ఒక్కరు తప్పనిసరిగా 15 ఆగస్టు రోజున ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేసి విరివిగా ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్‌తో పాటు పార్టీ నాయకులు లక్ష్మీపతి రాజు, రాజిరెడ్డి, రమేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

ఎల్లారెడ్డిపేట: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు తిరుప తిరెడ్డి కోరారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులతో కలిసి నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగర వేయాలన్నారు. ఈ నెల 12న కరీంనగర్ పట్టణంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో తలపెట్టిన యాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. నాయకులు లక్ష్మారెడ్డి, బుగ్గారెడ్డి, కృష్ణహరి, స్వామి, శ్రీకాంత్, రవి, రాజు, నరేష్, బాలగౌడ్, నర్సయ్య, రాజేందర్‌రెడ్డి, దేవదాస్, వేణు, కృష్ణారెడ్డి, సత్యనారాయణ, అల్లాభక్షి పాల్గొన్నారు.